క్లుప్తంగా

అందుబాటులో టెన్త్ స్టడీ మెటీరియల్



గ్రంథాలయంలో సిద్ధం చేసిన మెటీరియల్

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో దాతల సహకారంతో సమకూర్చిన టెన్త్ స్టడీ మెటీరియల్ ఇప్పుడు అందుబాటులో ఉందని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవనున్న విద్యార్థులంతా ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎస్సీ, సివిల్స్, పోలీస్, బ్యాంక్ ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు కూడా ఉన్నాయని, గ్రంథాలయానికి వచ్చి వీటిని ఉపయోగించుకోవాలన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణ దృశ్యం

వంగర: మండలంలోని పెద్దరాజులగుమ్మడ గ్రామంలో ఉన్న శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని, ఆలయ ధర్మకర్త ఆలుబిల్లి సుదర్శనరావు దంపతులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జాడ రమేష్‌శర్మ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కల్యాణోత్సవం చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేత్ర శస్త్రచికిత్సకు 44 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

తెర్లాం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్రవైద్య శిబిరంలో 44 మంది కంటి రోగులను శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్టు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి క్యాంప్ కో–ఆర్డినేటర్ సాయికుమార్ తెలిపారు. విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో చేపట్టిన ఈ శిబిరానికి 96 మంది హాజరై, కంటి పరీక్షలు చేయించుకున్నారని, వారిలో అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, కోశాధికారి వరదా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువల్లోని పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు ఆదివారం చురుగ్గా చేపట్టారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బాబానగర్, వాసవీనగర్, మెంతిపేట, సారథి కాలనీల్లోని మురుగు కాలువల్లోని చెత్తాచెదారం, మురుగు తొలగించారు. అనంతరం ట్రాక్టర్ల ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రానికి చెత్తను తరలించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

నిబంధనలు పాటించాలి

గుర్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, నిబంధనలను అనుసరించి గ్రామ దేవత పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కెల్ల గ్రామ పెద్దలకు చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి సూచించారు. కెల్ల గ్రామంలో సోమవారం నుంచి గ్రామదేవత పండగ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ గ్రామపెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఆయన సమావేశమయ్యారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందు న ఎటువంటి ఘర్షణ జరిగిగా గ్రామ పెద్దలే బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఐ షణ్ముఖరావు, ఎస్‌ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. చిన్నారుల సంబరం!



చార్టులపై తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

- శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు
- ఆటపాటలతో పాటు విద్యా సంబంధిత అంశాలపై శిక్షణ
- లైబ్రరీలకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్న చిన్నారులు



రామభద్రపురం శాఖా గ్రంథాలయంలో క్యారమ్స్, చెస్ ఆడుతున్న చిన్నారులు

రామభద్రపురం:

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు.. పిల్లలు చేసే అల్లరి అంతా ఇంతా కాదు.. ఇల్లు పీకి పందిరేస్తారు బాబోయ్.. అని పెద్దలు అంటుండడం తెలిసిందే. ఇప్పుడు అందుకు భిన్నంగా వేసవి సెలవులే పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతున్నాయి. సెలవుల్లో విద్యార్థులు విచ్చలవిడిగా తిరిగి, చెడిపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో ఏటా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది. ఏడాది పాటు తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి, తమ ఆలోచనలకు మరింత పదును పెడుతున్నారు. రెండు వారాల పాటు పఠనాభ్యాసాన్ని దీక్షగా కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 42 శాఖా గ్రంథాలయాలు ఉండగా, వాటిలో కేంద్ర గ్రంథాలయం 01, ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలు 04, తృతీయ శ్రేణి గ్రంథాలయాలు 34, గ్రామీణ ప్రాంత గ్రంథాలయాలు 03 ఉన్నాయి. అన్ని శాఖా గ్రంథాలయాల్లోనూ ఈ వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు 5 నుంచి 15 ఏళ్లలోపు వయసు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి 50 మంది విద్యార్థుల వరకు క్రమం తప్పకుండా ఈ వేసవి శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. ఇక్కడికి వచ్చే విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో తెలుగు, గణితం, విజ్ఞానశాస్త్రం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వీటితో పాటు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నారు. చాలా సరదాగా సాగే ఈ శిక్షణా తరగతులకు వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తుండడం విశేషం.

ప్రతిరోజూ లైబ్రరీకి వెళ్తున్నా..



నేను ప్రతిరోజూ లైబ్రరీ(గ్రంథాలయం)కి వెళ్తున్నాను. సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు తెలుగు, గణితం, విజ్ఞానశాస్త్రం బోధిస్తున్నారు. విజ్ఞానం పంచే పుస్తకాలు చదివిస్తున్నారు. చాలా బాగుంది.

– కె.అనూష, విద్యార్థిని, రామభద్రపురం.

వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నాం..



పుస్తకాలు, కథలు చదవడం, రాయడం, చెప్పించడం, చిత్రలేఖనం, వక్తృత్వం, సంగీతం, నాటికలు, స్పోకెన్ ఇంగ్లిష్, చేతితో వివిధ కళాకృతుల తయారీ, నృత్యం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. ప్రతిరోజూ జరిగే కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులను బహుమతులతో అభినందించి, ప్రోత్సహిస్తున్నాం. గ్రంథాలయాలకు పిల్లలు ఎక్కువగా వస్తుండడం చాలా ఆనందంగా ఉంది.

– సత్యవాణి, శాఖా గ్రంథాలయాధికారి, రామభద్రపురం.

చిత్రలేఖనంపై దృష్టి సారించాలి



తాము వేసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే చిత్రలేఖనంపై దృష్టి సారించాలని, అది భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని రిటైర్డ్ ఎంఈవో ఎం.సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే బొమ్మలు వేయడం నేర్చుకుంటే ఇంటర్మీడియట్‌లో బైపీసీ గ్రూపులో జాయిన్ అయ్యే వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్ విశ్వేశ్వరరావు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, తెర్లాం..కు చెందిన దత్తి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు చిత్రలేఖనానికి సంబంధించిన పుస్తకాలను వితరణ చేశారు.

విద్యార్థినులను ప్రోత్సహించేందుకే అవార్డులు



బహుమతులు పొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

రాజాం సిటీ: బాగా చదువుతున్న విద్యార్థినులను మరింత ప్రోత్సహించేందుకే ఏటా యడ్ల నీరజారాణి గర్ల్స్ ఎస్ఎస్‌సీ అవార్డుల పేరిట అవార్డులు ఇస్తున్నామని డాక్టర్ యడ్ల నీరజారాణి తెలిపారు. మండల పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 540 పైబడి మార్కులు సాధించిన విద్యార్థినులకు ఆదివారం పరీక్ష నిర్వహించి, అవార్డులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లోనూ బాగా రాణించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిభా పరీక్షకు రాజాం నియోజకవర్గంతో పాటు తెర్లాం, పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, బూర్జ మండలాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 126 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సంతకవిటి మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్కలపోతు వాహిని, వంగర మండలంలోని అరసాడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కొరటాన త్రివేణి, సంతకవిటి మండలంలోని వాల్తేరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సింగిపురపు హారిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకోగా, వీరికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతితో పాటు షీల్డులు అందజేశారు. ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన మరో 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, సత్యనారాయణ, జగదీశ్వరి, వి.వెంకటరావు, వై.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కొమిరలో విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులంతా విత్తనాల కోసం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, చాటాయవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న విత్తనాల నిమిత్తం రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన ఆదివారం పరిశీలించారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేసి, ఏ రైతుకు ఏ రకమైన విత్తనాలు కావాలో నమోదు చేసుకోవాలని, వాటిని సకాలంలో వారికి అందివ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా మండలానికి ఎంత మొత్తంలో విత్తనాలు కావాలన్న విషయం తెలుస్తుందన్నారు. అన్ని గ్రామాల ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాడి లక్ష్మంనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కేశవరావు తదితరులు ఉన్నారు.

10 మంది గైర్హాజరు

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 300 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 290 మంది హాజరయ్యారని, 10 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బాడంగి: ఎన్నికల నేపథ్యంలో అనవసరంగా తగాదాలు ఆడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆర్.జయంతి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆమె.. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన రానున్నాయని, ఫలితాలను చూసి ఏ పార్టీ వారు తమ వ్యతిరేక పార్టీలతో గొడవలు పడవద్దని సూచించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

వంగర: పదో తరగతి పాసైన పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తూలుగు ఈశ్వరరావు, బి.పోలినాయుడు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఆదివారం మండలంలోని అరసాడ గ్రామంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న విద్య, సిబ్బంది నైపుణ్యం, సదుపాయాలు, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. కళాశాలలో చేరిన ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి ఉంచుతామన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలు కూడా నేర్పిస్తామన్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారీనికి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయి సిబ్బంది

దసంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో ఘనజీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. 400 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవుమూత్రం, 2 కిలోల బెల్లం, మరో 2 కిలోల పప్పు పిండి, గుప్పెడు మన్నును కలిపి ఉండలుగా చేసుకుని, వాటిని నీడలో ఆరబెట్టాలి. ఇలా తయారు చేసుకున్న ఘనజీవామృతాన్ని బాగా దున్నిన పొలంలో వేసుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. ఆ తర్వాత వేసుకునే పంటలు బాగా పండి, అధిక దిగుబడులను ఇస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసుకునే ఘనజీవామృతం, ద్రవజీవామృతం, అగ్నిఅస్త్రం వంటి ఎరువులు పంటలకు బాగా ఉపకరిస్తాయన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం చేసి, ఆరోగ్యవంతమైన పంటలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాత్రుని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణ అన్నారు. మండలంలోని గోపెంపేటలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సభకు హాజరైన ఆయన.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి గ్రామంలోని ప్రజలంతా ఆధ్యాత్మికంగా ఉండి, సత్కార్యాలు చేయాలని తెలిపారు. వీలైనంత వరకు ఏమీలేని వారికి తోచిన సాయం చేయాలన్నారు.

అందరూ సన్మార్గంలో నడిస్తేనే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో దేవుదలకు చెందిన ఆధ్యాత్మిక వక్త గొర్లె దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



బొబ్బిలి: సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

బొబ్బిలి: పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య అని, పేదల బాగు కోసం ఆయన నిరంతరం పరితపించేవాడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కొనియాడారు. స్థానిక పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచినా అత్యంత సాధారణ జీవితం గడిపి, సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జె.రామారావు, జి.వాసు, బి.వెంకటి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం తదితరులు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



బొద్దాం సమీపంలో సాగులో పామాయిల్ తోట

రాజాం: నియోజకవర్గంలోని బొద్దాం, సోపేరు, గార్రాజుచీపురుపల్లి, కొమెర, వెంకటాపురం, జావాం తదితర గ్రామాల్లోని రైతులంతా పామాయిల్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు పెంచుతున్న పామాయిల్ తోటలు ఇప్పుడు పూత దశకు చేరుకోగా, మరికొంతమంది రైతులు కొత్తగా పామాయిల్ తోటలు పెంచేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, మూడేళ్ల వయసుకే మొక్కలు పూత దశకు రావడం, మార్కెట్‌లో కూడా పంటకు బాగా డిమాండ్ ఉండడం, ఒక్కసారి వేసిన పంట 25 ఏళ్లపాటు దిగుబడిని ఇవ్వడం వంటివి రైతులను ఆకర్షిస్తున్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు తెలిపారు.

తాగునీటి కష్టాలు తీరాయి..



మజ్జిరాముడుపేటలో ఇంటి ముందు ఏర్పాటు చేసిన కుళాయి వద్ద తాగునీరు పడుతున్న మహిళ

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, బుడితిపేట, ఉనుకూరు, సోమరాజుపేట, వప్పంగి తదితర గ్రామాల్లోని ప్రజల తాగునీటి కష్టాలు తీరాయి. జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో ప్రతిరోజూ తాగునీటిని అందిస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీరు లేక నానా అవస్థలు పడ్డామని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే కుళాయిల ఏర్పాటు పనులు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ తెలిపారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాని, అభిమానులు కాని ఎవరైనా ఎన్నికల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లకు పాల్పడినా, గొడవలకు దిగినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.

నేత్ర వైద్య శిబిరం

మెరకముడిదాం:

స్థానిక పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ శిబిరంలో 94 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ విశాఖ పట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు సీహెచ్.వెంకటరమణ, పవిత్ర తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

